సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



వారోత్సవాలు ప్రారంభం

డాబాగార్డెన్స్ (విశాఖ): జేసీఐ విశాఖ వ్యాలీ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు వృద్ధులతో సంతోషంగా గడిపారు.



గడువు పొడిగించాలి

విశాఖ సిటీ: ఏపీ పీజీ సెట్‌లో అడ్మిషన్లు పొందిన వారు రిపోర్టింగ్ చేసే తేదీని పొడిగించాలని జీసీ సంఘం నాయకులు కోరారు.



నవ్వులు పూయించిన నాటికలు

మద్దిలపాలెం (విశాఖ): కేవీ మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదర్శించిన పుటుక్కు జర జర డుబుక్కు మే.. నాటిక ప్రేక్షకులను నవ్వించింది.



బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో వరద ఉధృతికి తాచేరు నదిపై గండి పడ్డ డైవర్షన్ రోడ్డు

పోటెత్తిన వరద

వర్షాలు తగ్గినా వరద ఉధృతి హడలెత్తిస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దేరు, తాచేరు నదుల ఉగ్రరూపం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చి చేరిన నీటితో రిజర్వాయర్లు ప్రమాద స్థాయికి చేరుతున్నాయి. ఎస్.రాయవరం–లింగరాజుపాలెం బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. విజయరామరాజుపేటలో తాచేరు నదిపై గండిపడ్డ డైవర్షన్ రోడ్డును, వడ్డాదిలో పెద్దేరు నదిపై నీట మునిగిన డైవర్షన్ రోడ్డును కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అధికారులను అప్రమత్తం చేశారు.

- వడ్డాదిలో నీట మునిగిన డైవర్షన్ రోడ్డు
- విజయరామరాజుపేటలో నీటి ఉధృతి
- ఎగువ ఏజెన్సీ నుంచి వరాహా నదిలోకి వరద నీరు
- తాండవ ఉధృతితో పాయకరావుపేట అప్రమత్తం

బుచ్చెయ్యపేట: వరద ఉరకలెత్తింది. ఎడతెరిపి లేని వర్షాలతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వడ్డాదిలో పెద్దేరు నది ఉధృతంగా ప్రవహించడంతో డైవర్షన్ రోడ్డు మొత్తం నీటిలో మునిగిపోయింది. దీంతో శిథిలమైన రోడ్డు మీద నుంచి పోలీసు బందోబస్తు మధ్యన వాహనాలు నెమ్మదిగా రాకపోకలు సాగించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. విజయరామరాజుపేట తాచేరు నదిపై గండిపడ్డ డైవర్షన్ రోడ్డు వద్ద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. వడ్డాదిలో పెద్దేరు నీటి ఉధృతిని ఆర్డీవో చిన్నికృష్ణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ క్రాంతిమతి అధికారులతో కలిసి పరిశీలించారు. బంగారుమెట్ట, ఎల్‌బి పురం, విజయరామరాజుపేట తదితర గ్రామాల లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. బుచ్చెయ్యపేట, బంగారుమెట్ట, వడ్డాది తదితర గ్రామాల్లో ప్రధాన రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు బైటకు పోయేలా ఎంపీడీవో సువర్ణరాజు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి తదితర్లు పంచాయతీ సిబ్బందితో కాలువలు చేసి నీరు బైటకు పోయేలా చేశారు. పలు ప్రధాన రహదారుల గోతుల్లో చేరిన వర్షం నీటితో వాహనదార్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజువారీ కూలీలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బుచ్చెయ్యపేట: వడ్డాదిలో పెద్దేరు నీటి ఉధృతి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

నీటి ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

విజయరామరాజుపేటలో తాచేరు నదిపై గండిపడ్డ డైవర్షన్ రోడ్డును, వడ్డాదిలో పెద్దేరు నదిపై నీట మునిగిన డైవర్షన్ రోడ్డును కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. విజయరామరాజుపేట వంతెన నిర్మాణానికి, డైవర్షన్ రోడ్డుకు నిధులు మంజూరు చేసినా పనులు ఎందుకు జరగలేదని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ను తీసుకొని బుధవారం తనను కలవాలని ఈఈ రమేష్‌ను ఆమె ఆదేశించారు. పెద్దేరు డైవర్షన్ రోడ్డు కానాల వద్ద తుప్పలు డొంకలు తీయించి నీటి ఉధృతి తగ్గిన తరవాత ప్రయాణికుల రాకపోకలకు మార్గం సుగమం చేయాలన్నారు. బంగారుమెట్ట జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు గోతుల్లో చేరిన వర్షం నీరు బైటకు పోయేలా చేయకపోవడంపై అధికారులపై కలెక్టర్ మండిపడ్డారు. తక్షణం గోతులను పూడ్చాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సువర్ణరాజు, డీఈ ధనుంజయ్, తదితర్లు పాల్గొన్నారు.



ఎస్.రాయవరం-లింగరాజుపాలెం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



చోడవరం: లక్ష్మీపురం చెరువు పొర్లుగట్టుపై వరద ఉధృతితో ఒకరినొకరు పట్టుకొని రోడ్డు దాటుతున్న గ్రామ ప్రజలు



కోటవురట్ల: జల్లూరు శివారు వరాహనదిలో ఉధృతి

వరాహనది ఉగ్రరూపం

కోటవురట్ల/ఎస్.రాయవరం: వరాహనది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలతో నదికి వరద నీరు పోటెత్తుతోంది. సోమవారం నదిలోకి భారీగా నీరు చేరడంతో గట్లను తాకుతూ ప్రవహిస్తోంది. దీంతో జల్లూరు వంతెనకు ప్రమాదం పొంచి ఉంది. రామచంద్రపురం శివారున వరాహనదిలో ఉన్న పైలెట్ ప్రాజెక్టు వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉంది. పాతరోడ్డు సమీపంలో వరాహనదిలో సర్పానది కూడా కలియడంతో నది ఉగ్రంగా ప్రవహిస్తోంది. పలుచోట్ల వరాహనది తీరం కోతకు గురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్.రాయవరం మండలంలో ఎస్.రాయవరం–లింగరాజుపాలెం బ్రిడ్జిపై వరద నీరు ప్రవహించి సుమారు 3 గంటలపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వరద కారణంగా సుమారు 141 హెక్టార్ల వరి పొలాలు నీట మునిగాయని వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు.



కోటవురట్ల: రామచంద్రపురం శివారున వరాహనదిలో ఉన్న పైలట్ ప్రాజెక్టు వద్ద ఉధృతి

తాండవ ఉధృతి



పాయకరావుపేట : ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నది

పాయకరావుపేట: తాండవ రిజర్వాయర్‌లో వర్షం నీటిని విడిచిపెట్టడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టణంలో లోతట్టు ప్రాంతమైన చాకలి పేటను మండల రెవెన్యూ అధికారి కె.జయప్రకాష్, సీఐ జి.ఎస్.అప్పన్న పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని చాకలిపేటవాసులకు సూచించారు. వారం రోజులుగా పడుతున్న వర్షాలకు గ్రామాల్లో ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉండిపోయింది. అదే విధంగా పంట పొలాల్లో నీరు ఎక్కువగా ఉండిపోవడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న పంట పొలాలు నీట మునిగినందున వారు నిరాశ చెందుతున్నారు. సాగునీటి కాలువలు ముఠా, ఆవ, మంగవరం భూమి కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

పరిశీలించిన మంత్రి అనిత

పట్టణంలో లోతట్టు ప్రాంతమైన చాకలిపేటను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. తాండవ నది ఉధృతికి చాకలిపేట వాసులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరాకాలనీ, అంబేద్కర్ కాలనీ వాసులకు సమస్యలు ఎదురుకాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఘాట్‌రోడ్డు పరిశీలన

కోటవురట్ల: ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డును మంత్రి అనిత పరిశీలించారు. రోడ్డు పటిష్టతకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రామచంద్రపురం జంక్షన్‌లో కుంగిపోయిన మినీ వంతెనను కూడా ఆమె పరిశీలించారు. రాకపోకలకు ఆటంకం లేకుండా పక్కనే డైవర్షన్ రోడ్డును వేయించాలని అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, ఇతర శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కోటవురట్ల: ఇందేశమ్మవాక వద్ద ఘాట్‌రోడ్డును పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

న్యూస్‌రీల్

భస్మ అలంకరణలో స్వయంభూ గణనాథుడు



చోడవరం: చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి సోమవారం భస్మ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యసిద్ధి గణపతిస్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సీఐల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో 9 మంది సీఐలను బదిలీ చేశారు. వీరిలో ఒకరిని వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న ఆరుగురికి వివిధ జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఇద్దరిని రేంజ్ వీఆర్ నుంచి జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. ఈమేరకు సోమవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం టౌన్‌లో పనిచేస్తున్న త్రిపురాన క్రాంతికుమార్‌ను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న సీఐ వానపల్లి నాగరాజును శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐగా, ఎంవీవీ రమణమూర్తిని విజయనగరానికి, బుచ్చిరాజును అనకాపల్లి పీసీఆర్ సీఐగా, జి.దుర్గాప్రసాద్‌ను అల్లూరి సోషల్ మీడియా సైబర్‌సెల్ సీఐగా, జి.ఆర్.కె.టి.తులసీదాస్‌ను శ్రీకాకుళం డీటీసీకి, సువ్వారి రామును అల్లూరి ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐగా, గంగుల గోవిందరావును నర్సీపట్నం టౌన్ సీఐగా, షేక్ గఫూర్‌ను అనకాపల్లి వీఆర్‌కు బదిలీ చేశారు.

భారీగా పంట నష్టం

- 7 వేల ఎకరాలు నీట మునక
- పొంగిపొర్లుతున్న రిజర్వాయర్లు, వాగులు, గెడ్డలు
- తాండవ, రైవాడ, పెద్దేరు, కళ్యాణపులోవ, కోనాం రిజర్వాయర్ల గేట్ల ఎత్తివేత
- అత్యంత ప్రమాదకరంగా తాండవ రిజర్వాయర్



నక్కపల్లి: ఉద్దండపురం గోపాలపట్నం ఆవ ప్రాంతాల్లో వరద నీటిలో మునిగిన వరి పొలాలు

సాక్షి, అనకాపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో జిల్లా వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి నుంచి మూడు రోజుల పాటు భారీగా వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి సోమవారం వరకూ 2767.3 మి.మీ వర్షం పాతం నమోదైంది. సగటు వర్షపాతం 115.3 మిల్లీమీటర్లు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు రిజర్వాయర్లోకి చేరడంతో ఇన్‌ఫ్లో పెరిగి రిజర్వాయర్లు ప్రమాదస్థాయికి చేరాయి. దీంతో జిల్లాలో ఉన్న తాండవ, పెద్దేరు, కోనాం, కళ్యాణపులోవ రిజర్వాయర్లు గరిష్ఠ నీటిమట్టానికి చేరడంతో గేట్లు ఎత్తివేయడంతో నదులు, వాగులు, చెరువులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంట పొలాలు భారీగా నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో వరి పంట, మరో వెయ్యి ఎకరాల్లో ఉద్యానవన, ఇతర పంటలు నీట మునిగాయి. వ్యవసాయ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం.. అనకాపల్లి జిల్లాలో మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి 1,528 హెక్టార్ల (3200 ఎకరాల) వరి పంట నీట మునిగింది. మొత్తం 53,121 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గానూ ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 45,408 హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు. వ్యవసాయ అధికారులు ఇచ్చిన నివేదికలో 1528 హెక్టార్ల వరి పంట నీటమునిగినట్లు వెల్లడించారు.

నీట మునిగిన పంటను కాపాడండిలా..

నీట మునిగిన పంటను కాపాడుకునేలా రైతులకు వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు. పొలాల్లో నిల్వ నీరు బయటకు పోయిన తరువాత ఎకరం వరి పొలానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ ఎరువులు వేయాలని సూచిస్తున్నారు. చీడ పీడలు సోకకుండా ఒక గ్రాము కార్బండిజం ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచనలు చేస్తున్నారు.

అత్యంత ప్రమాదకరంగా తాండవ రిజర్వాయర్

జిల్లాలో ఉన్న తాండవ రిజర్వాయర్, కోనాం, కళ్యాణపులోవ రిజర్వాయర్ల నీటిమట్టం ప్రమాదస్థాయికు చేరుకోవడంతో సోమవారం కూడా గేట్లు ఎత్తివేశారు. దీంతో తాండవ రిజర్వాయర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా.. ఈ వర్షాల కారణంగా 379 అడుగులకు చేరుకుంది. స్పిల్‌వే గేట్ల ద్వారా నదీలోకి నీటిని నాలుగు విడతల్లో విడుదల చేశారు. కోనాం రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్ల కాగా.. 98.60 మీటర్లకు చేరుకుంది. ఆదివారం రెండు గేట్లు ఎత్తి 1000 క్యూసెక్కుల నీరు, సోమవారం ఉదయం 1000 క్యూసెక్కుల నీరు వదిలారు. కళ్యాణపులోవ రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా.. 459.30 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లో ఆదివారం రెండు గేట్ల ద్వారా 200 క్యూసెక్కులు, సోమవారం నాలుగు గేట్ల ద్వారా 300 క్యూసెక్కుల నీరు నదిలోకి విడుదల చేశారు. దేవరాపల్లి మండలంలో రైవాడ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉంది. రైవాడ రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా.. ప్రస్తుతం 111.50 మీటర్లకు చేరింది. భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటితో మరో 3 మీటర్లకు నీటిమట్టం చేరితే గేట్లు ఎత్తే అవకాశం ఉంటుంది

కొనసాగనున్న కమాండ్ కంట్రోల్

రెవెన్యూ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్స్ మంగళవారం కూడా కొనసాగనున్నాయి. ఫోన్ నంబర్లు ఈ విధంగా ఉన్నాయి.

కలెక్టరేట్
08924-226599,
08924-222888

అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం
9491998293

నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం
7075356563

జీవీఎంసీ కార్మికుల సమ్మె నోటీసు

సీతమ్మధార (విశాఖ): జీవీఎంసీలోని పలు విభాగాలకు చెందిన కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి గాను సమ్మె నోటీసు ఇచ్చామని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్, లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు వెల్లడించారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీపార్కు వద్ద సోమవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీలోని నీటి సరఫరా, యూజీడీ, పంప్ హౌస్, ప్లాంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇంజినీరింగ్ సెక్షన్లలో పబ్లిక్ వర్క్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, పీఎల్‌సీ సెక్షన్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.25,410, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.29,610 వంతున వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జీవీఎంసీ అధికారులు ప్రభుత్వ జీవోలు, కౌన్సిల్ తీర్మానాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సోమవారం నీటిసరఫరా ఆపేసి టోకెన్ సమ్మె ద్వారా నిరసన తెలియజేశామన్నారు. తొమ్మిదిమంది అధికారుల నివేదిక ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కేటగిరీ విభజన చేసి వేతనాలు చెల్లించాలని కోరారు. ఐటీఐ సర్టిఫికెట్ ఉన్నవారికి సెమీస్కిల్డ్‌గా పరిగణించాలని కోరారు. నీటిసరఫరా ఫిల్టర్‌బెడ్ ఆపరేటర్లను స్కిల్డ్ వర్కర్లుగా గుర్తించాలని సూచించారు.


అనకాపల్లిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

నర్సీపట్నం: జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో త్వరలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ప్రారంభిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త తెలిపారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో పనిచేసే నర్సీపట్నం, మాకవరపాలెం మండలాలకు చెందిన మహిళలు ఈ హాస్టల్‌లో ఉండి ఉద్యోగం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. హాస్టల్‌లో ఉండేందుకు అంగీకారమైతే పూర్తి వివరాలను ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని సీడీపీవో కోరారు.

ప్రమాదకరంగా బాలుర హాస్టల్

- వర్షాలకు తడిసిపోయిన విద్యార్థుల పుస్తకాలు, సామగ్రి
- దేవరాపల్లి హైస్కూల్ భవనంలోకి విద్యార్థుల తరలింపు

దేవరాపల్లి : దేవరాపల్లిలోని బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఇది ప్రమాదకరంగా మారడంతో అధికారులు సోమవారం ఇక్కడి విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలోకి తరలించారు. ఇటీవల విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వసతి గృహంలోని గదులన్నీ కారిపోతున్నాయి. విద్యార్థులు తడిసిపోతుండటంతో పాటు ఇక్కడున్న సామగ్రి కూడా తడిసి ముద్దయిపోతోంది. శ్లాబ్ పెచ్చులు సైతం రాలి పడుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా 57 మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అక్కడే వారికి భోజనం తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. వసతి గృహంలోని ఆఫీస్ రూమ్, వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థులుండే అన్ని గదులు వర్షం నీటితో తడిసి ముద్దయ్యాయి. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వసతి గృహం వరండాలో వంట చేసి హైస్కూల్లో ఉన్న విద్యార్థులకు అందజేస్తున్నారు. వర్షం తగ్గుముఖం పట్టే వరకు హైస్కూల్ భవనంలోనే విద్యార్థులను ఉంచుతామని వసతిగృహం అధికారి కె.వి. లక్ష్మీనారాయణ తెలిపారు. కాగా హైస్కూల్లోని వసతిగృహ విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను ఎంఈవో బి. పడాల్‌దాస్, ఆర్ఐ ఎస్. సతీష్, వీఆర్‌వో నాగేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ రత్నం, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అప్పలరాజు తదితరులు పరిశీలించారు.



శిథిలమై ప్రమాదకరంగా మారిన బీసీ బాలుర వసతి గృహం



దేవరాపల్లి హైస్కూల్ భవనంలోకి తరలించిన బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులు

వలలో చిక్కుకున్న చేపపిల్ల చివరి నిమిషం వరకూ తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. చిరుత పులి కూడా ఒంటినిండా తూటాలతోనే వేటగాడికి ఎదురొడ్డి నిలుస్తుంది. ఆకతాయి కుర్రాళ్లు కసిదీరా నలిపేసిన సీతాకోకచిలుక అయినా తెగిన రెక్కలతోనే మొండిగా ఎగరాలని చూస్తుంది. సృష్టిలో ఏ జీవికీ ఆత్మహత్య ఆలోచన రాదు – ఒక్క మనిషికే ఆ విపరీత బుద్ధి! చిన్న సమస్య రాగానే తల్లడిల్లిపోతాడు. చావే నయమన్న భ్రమలో పడిపోతాడు. అక్షరాస్యులైనా.. నిరక్షరాస్యులైనా.. నిరుద్యోగి అయినా.. జీవితంలో స్థిరపడ్డ వారైనా.. చిన్నపాటి సమస్యకే బలవన్మరణాలను ఆశ్రయిస్తున్నారు. ప్రేమ వైఫల్యం.. ఒంటరితనం.. నిరుద్యోగం.. ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ కలహాలు.. కారణమేదైనా ప్రాణాలు వదులుతున్నారు. జీవితాన్ని జయించలేక చావును చేరుకుంటున్నారు. నేడు 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం' సందర్భంగా ప్రత్యేక కథనం.–విశాఖ సిటీ





జీవించు.. సాధించు

- ఆత్మహత్యలు వద్దు.. సమస్యల పరిష్కారానికి పోరాడదాం
- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఆత్మహత్యలు
- బలవన్మరణాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో విశాఖ
- ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం

జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే.. ఒకటి కాలం.. మరొకటి ప్రాణం. తొందరపాటు జీవితాన్ని చిదిమేస్తుంది. మనపై ప్రేమను పెంచుకున్న కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగులుస్తుంది. గెలవడం ధ్యేయం కావాలి.. కానీ గెలుపే జీవితం కాదు. ఓడినంత మాత్రాన జీవితం వృథా అనుకుంటే భవిష్యత్తు శూన్యంలా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసానికి మించిన విజయం లేదు. ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం విలువ తెలుస్తుంది. ఏ సమస్యకూ ఆత్మహత్య పరిష్కారం కాదు. ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారు? ఇది కచ్చితమైన సమాధానం లేని ప్రశ్న. ఇటీవల కాలంలో కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిళ్ల కారణంగా విద్యార్థులే ఎక్కువగా ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.



20 శాతానికి పైగా పెరుగుదల

విశాఖలో బలవన్మరణాలు భయపెడుతున్నాయి. బలవన్మరణాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో విశాఖ ఉంది. ఏటా 20 శాతానికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు జాతీయ నేర నమోదు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో సగం విద్యార్థులే కావడం బాధాకర విషయం. చదవలేక కొందరు, సహచర విద్యార్థులు, ఫ్యాకల్టీ వేధింపులతో మరికొందరు, మార్కులు రాలేదని ఇంకొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలాగే ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో చాలా సందర్భాల్లో బలమైన కారణాలు కనిపించడం లేదని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి బాగా మానసిక ఒత్తిడికి లోనైప్పుడు, సమస్యకు పరిష్కారం లభించనప్పుడు, తమకు ఏం చేయాలో, సమస్య నుంచి ఎలా బయటపడాలో తెలియక, దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఉద్యోగం లేదని, మానసిక రుగ్మతలు, మత్తు మందులకు బానిసవడం, విపరీతమైన భయం, ఎక్కువగా నిరాశకు గురికావడం, విపరీతమైన అప్పులు, జీవితంపై నమ్మకం సన్నగిల్లడం, వ్యవసాయంలో నష్టాలు, పరీక్షలో ఉత్తీర్ణత కాకపోవడం ఇలా అనేక కారణాలు ఉంటున్నాయి.

సంవత్సరం	ఏపీ	విజయవాడ	విశాఖ
2023	9108	673	479
2022	8908	634	461
2021	8067	385	378
2020	7043	324	306

కుటుంబ సభ్యుల పాత్ర కీలకం



ఆత్మహత్యల నివారణకు ముఖ్యంగా కుటుంబ సభ్యుల పాత్ర కీలకం. నిరాశతో ఉన్న వారిని గమనిస్తూ ఉండాలి. వారిని దగ్గరకు తీసుకుని ఆత్మీయంగా ఓదార్చాలి. నేనున్నానంటూ భరోసా కల్పించాలి. సమస్య పరిష్కారానికి సూచనలు చేయాలి. కష్టాన్ని ఎలా ఎదుర్కోవాలో వారికి నేర్పాలి. విద్యార్థులైతే బాల్యం నుంచే వారిలో మనోధైర్యం నింపాలి. చిన్న చిన్న విషయాలే కాదు పెద్ద సమస్యలు వచ్చినా ఏ విధంగా ఎదుర్కోవాలో వివరిస్తూ ఉండాలి.

పాజిటివ్ ఆలోచనలతో నివారించవచ్చు



ఆత్మహత్యలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. నెగెటివ్ ఆలోచనలకు దూరంగా ఉండాలి. పాటిజివ్ ఆలోచనలతో జీవితాన్ని మెరుగుపర్చుకోవచ్చు. ప్రాణం తీసుకునే ఆలోచనలను విరమించుకోవచ్చు. ఆత్మహత్య ఆలోచనలు అసంకల్పితంగా ఉద్భవిస్తాయి. ఆ ఆలోచనలను తక్షణమే ఆపే మందులు అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత కౌన్సెలింగ్ కూడా మెరుగైన జీవనానికి దోహదపడుతుంది.

– డాక్టర్ ఎస్.ఎస్.రాజు, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయానికి 10 అర్జీలు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 10 అర్జీలు స్వీకరించినట్లు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటూ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ అంశాలకు సంబంధించి అర్జీలు వచ్చాయని, చట్టపరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, క్రైం ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్‌ఐ దివ్య పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో పీహెచ్‌సీ పరిశీలన



పీహెచ్‌సీలో స్కానింగ్ తీరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ

పాయకరావుపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.వి. బాలాజీ పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ ద్వారా గర్భిణులకు అందించే వైద్య పరీక్షలు, సేవలను పరిశీలించారు. గర్భిణులకు చేసే స్కానింగ్‌ను పర్యవేక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సుభాష్‌కు సూచించారు. ముంపు ప్రాంతాలను గుర్తించి, అవసరమైన వారికి తక్షణమే వైద్య సేవలు అందించాలని సూచించారు.

కాశీపురం విద్యార్థి సత్తా

- రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



అర్హత సాధించిన రెడ్డి రాముడు

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రెడ్డి రాముడు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించాడని స్థానిక హైస్కూల్ హెచ్ఎం టీబీటీ సుందరి తెలిపారు. ఈ నెల 8న గోపాలపట్నం ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్టు ఎంపికలో తొమ్మిదవ తరగతి విద్యార్థి రాముడు ప్రతిభ కనబరచడంతో ఎంపికయ్యాడన్నారు. తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటాడని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిజికల్ డైరెక్టర్ లేకపోయినప్పటికీ తర్ఫీదు ఇచ్చిన కొట్టాన రాంబాబు మాస్టారును, రెడ్డి రాముడిని హెచ్ఎం సుందరి, ఇతర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

తుపాను బాధితులకు పరిహారం చెల్లించాలి

అనకాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ చత్రాపల్లిలో అర్ధరాత్రి కొండ చరియలు విరిగి పడడంతో కొర్రా కుమారి (20) మృతి చెందగా మరో ముగ్గురు గల్లంతైన ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. భారీ వర్షాలకు చత్రాపల్లిలో కొండ చరియలు విరిగిపడి ఒకరు మృతి చెందగా ముగ్గురు గల్లంతయ్యారన్నారు. వారి ఇళ్లు ధ్వంసం అయ్యాయని, విలువైన సామగ్రి కూడా పనికి రాకుండా పోయిందని తెలిపారు. ఆ ప్రాంతంలో సిగ్నల్స్ లేకపోవడంతో ఎటువంటి సమాచారం బాహ్య ప్రపంచానికి తెలియలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విశాఖ ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగం స్పందించి బాధితులను ఆదుకోవాలని ఆయన కోరారు. చత్రాపల్లిలో సర్వం కోల్పోయిన వారిని ఆదుకుని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

వర్షం నీటిని దిగువకు తరలించాలని నిరసన



పొలాల్లో నీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

తుమ్మపాల : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నాలుగు రోజులుగా వరి పొలాల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని వెంటనే దిగువకు వదిలి కొండకర్ల ఆవకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. శంకరం వరి పొలాలను సోమవారం పరిశీలించి ప్రభుత్వ వైఫల్యంపై సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వి.వి. శ్రీనివాసరావు నిరాశ వ్యక్తం చేశారు. వందల ఎకరాలు నీటి ముంపునకు గురై నాలుగు రోజులు కావస్తున్నా అధికార యంత్రాంగం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకోలేదన్నారు. ప్రచారం కోసమే ముంపు ప్రాంతాల్లో పర్యటనలు చేస్తున్నారన్నారు. ఇక్కడి నుంచి ఆవఖండానికి విస్తరించిన పులికాలువ, ఏలేరు కాలువ కలిసిన చోట నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని, కాలువలకు గట్లు తెగిపోతే పట్టణం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నేటికీ తోటాడ వద్ద రెగ్యులేటరీ గేట్లు తెరవకపోవడం ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండలంలో కొండుపాలెం, సీహెచ్ఎన్ అగ్రహారం, మార్టూరు, రేబాక, శంకరంలో బొజ్జన్నకొండ పరిసరాల్లో వరి పొలాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయన్నారు. నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి సబ్బవరం హైవే కింద కల్వర్టు, 12 కాణాలు ఏర్పాటు చేయగా రెండు మినహా మిగిలిన కాణాలు తెరచుకోలేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, చీడపురుగుల నివారణ నిమిత్తం మందులు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మామిడి రమణ, చలపతి, రైతు సంఘం నాయకుడు కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద స్థాయికి తాండవ నీటి మట్టం

- నదీ పరీవాహక ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరిక



స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి విడుదల అవుతున్న నీరు (ఇన్‌సెట్), తాండవ ప్రాజెక్టు నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తున్న ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు, డీఈ అనురాధ

నాతవరం: తుపాను కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి అధిక మొత్తంలో నీరు రావడంతో నీటి మట్టం నివారించేందుకు స్పిల్‌వే గేట్ల ద్వారా తాండవ నదిలోకి 9500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు తెలిపారు. ఆయన సోమవారం సిబ్బందితో కలిసి తాండవ నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఆదివారం రాత్రంతా 1250 క్యూసెక్కులు, సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 5435 క్యూసెక్కులు, సాయంత్రం వరకు 7435 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేశామన్నారు. సాయంత్రం 5 గంటలకు తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 379 అడుగులు దాటిపోవడంతో స్పిల్‌వే గేట్ల ద్వారా 9500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. తాండవ నీటి మట్టం 380 అడుగులు కాగా వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ అనురాధ, జేఈలు రామకృష్ణ, శ్యామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- జలాశయం అధికారులను హెచ్చరించిన కలెక్టర్ విజయ కృష్ణన్

మాడుగుల : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయం అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దేరు జలాశయాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. జలాశయం గేట్లు, వస్తున్న వరద నీటిపై జేఈ భార్గవకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జలాశయం అధికారులు తుపాను తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జలాశయం గేట్లు బాగున్నాయని, ఇన్‌ఫ్లో వచ్చింది వచ్చినట్లుగా విడుదల చేస్తున్నామని జేఈ బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రత్నం, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, సర్పంచ్ ధారా మల్లేశ్వరి చిన్ని, ఈఈ ఎ. త్రినాథం, డీఈ, వి. చిన్నంనాయుడు, జేఈలు భార్గవ కుమార్, సుధాకర్‌రెడ్డి, పైడితల్లినాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జలాశయం అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

శానిటేషన్ వర్కర్ల వినూత్న నిరసన

- ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరిక



ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న శానిటేషన్ వర్కర్లు

యలమంచిలి రూరల్ : స్థానిక 30 పడకల సామాజిక ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుధ్య, పెస్ట్‌కంట్రోల్, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు సోమవారం ఆస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. మూడు నెలలుగా తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన చేపడుతున్నా అధికారులు కానీ, ప్రభుత్వ పెద్దలు కానీ పట్టించుకోవడంలేదని వాపోయారు. జీతాలందక తాము ఎలా జీవించాలని వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ తక్షణమే దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. ఈ నెల 15వ తేదీలోగా బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు 2021 జూన్ నుంచి రావాల్సిన పీఎఫ్ సొమ్ము తమ ఖాతాలకు జమ చేయాలని, వేతనాలను నిబంధనల ప్రకారం పెంచాలని కోరారు. ఇదే తీరు కొనసాగితే త్వరలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాటిపాకల చిన్న అప్పారావు, మడక శ్రీను, రత్నం, వెంకటలక్ష్మి, రమణమ్మ, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లలో మెలకువలతో అధిక దిగుబడి



కాశీపురంలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు బృందం

దేవరాపల్లి : వరి నాట్ల సమయంలో చిన్నపాటి మెలకువలు పాటించడం ద్వారా ఆశాజనకంగా దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని కాశీపురం, నాగయ్యపేట, రైవాడ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.ఆదిలక్ష్మి, మరో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి. చంద్రశేఖర్ సోమవారం పర్యటించి వరి పొలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆలస్యంగా నాట్లు వేసే రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. 50 నుండి 60 రోజుల వయసున్న వరి నారును నాట్లు వేయాల్సి వస్తే పిలకలు దగ్గర దగ్గరగా వేసుకోవాలని సూచించారు. వరి నాట్లు వేసే ముందు దమ్ములో ఎకరానికి 50 కేజీల డీఏపీ, 15 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. నాట్లు వేసిన తర్వాత 15 కేజీల యూరియా, మరలా 35 రోజుల తర్వాత 15 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వేసుకోవడం ద్వారా పంట దిగుబడి బాగుంటుందని రైతులకు వివరించారు. వీరి వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్, ఆర్‌బీకే ఇన్‌చార్జి రామానాయుడు తదితరులు ఉన్నారు.

చోడపల్లి వద్ద కూలిన భారీ వృక్షం



చోడపల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ మర్రిచెట్టు

అచ్యుతాపురం (మునగపాక):

అచ్యుతాపురం మండలం చోడపల్లి ప్రధాన రహదారిపై భారీ మర్రి చెట్టు కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడ్డారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చోడపల్లి వద్ద భారీ చెట్టు సోమవారం కూలిపోయింది. నిత్యం ఈ మార్గంలో బ్రాండిక్స్‌కు వెళ్లే ఉద్యోగులు, అలాగే పలు పనులపై అనకాపల్లికి వచ్చే వ్యాపారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. దీంతో వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

రికార్డ్ అసిస్టెంట్ అదృశ్యం



రికార్డు అసిస్టెంట్ దేముడు

యలమంచిలి రూరల్ : యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న గులివిందల దేముడు (41) అదృశ్యమైనట్టు అతని తమ్ముడు అప్పలకొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె. సావిత్రి సోమవారం రాత్రి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిన దేముడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2012లో వివాహమైన దేముడు భార్యతో మనస్పర్థల కారణంగా 6 నెలల క్రితం విడాకులు తీసుకున్నాడు. 8 ఏళ్ల కుమార్తె, భార్య పుట్టింటికి వెళ్లిపోయారు. కొద్దికాలంగా దేముడు తాను ఉద్యోగం చేయలేకపోతున్నానని, ఉద్యోగం మానేస్తానని తల్లి, కుటుంబ సభ్యులతో చెబుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం మానేస్తే ఎలా బతుకుతామంటూ వారు దేముడికి నచ్చజెపుతున్నారు. ఈ నేపథ్యంలో దేముడు అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



తాళ్లపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట : వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని, ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ భరోసా ఇచ్చారు. మండలంలోని నూతలగుంటపాలెం, ఏనుగుతుని, తాళ్లపాలెం, గైతులపాలెం, నరసింగబిల్లి గ్రామాల్లో నీటి ముంపునకు గురైన పొలాలను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు నీట మునిగిన పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నార న్నారు. ఈ నేపథ్యంలో తగిన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జనసేన నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, కలిగెట్ల సింహాద్రి, కలగా గోవింద, కర్రి గోవింద, టీడీపీ నాయకులు అందె రమణ, యలమంచిలి వెంకటరావు, కలిగెట్ల సంజీవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నెమలి గణేశుని విగ్రహం



సాయినగర్‌లో ఏర్పాటు చేసిన నెమలి గణేష్ విగ్రహం

కశింకోట : ఇక్కడి సాయినగర్‌లో నెలకొల్పిన ఏడు అడుగుల నెమలి గణేష్ విగ్రహం ఆకట్టుకుంటోంది. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దీన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చెరువులో పడి గేదె మృతి



గేదె మృతి చెందడంతో రోదిస్తున్న పడాల కొండమ్మ

మాడుగుల రూరల్: కూర్మానాథపురం చెరువులో పడి సోమవారం గేదె మృతి చెందింది. ఎం. కోడూరు గ్రామానికి చెందిన పడాల కొండమ్మకు చెందిన పాడిగేదె మేతకు వెళ్లి, కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటనపై కొండమ్మ ఫిర్యాదు మేరకు ఎం. కోడూరు పశువైద్యాధికారి అరుణ కిరణ్ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. మృతి చెందిన పాడి గేదె ఖరీదు రూ.50వేలు ఉంటుందని అంచనా. ప్రమాద వివరాలపై వీఆర్వో, తహసీల్దార్, పశువైద్యశాఖ సహాయ సంచాలకులకు సమాచారం అందించామని పశువైద్యాధికారి అరుణకిరణ్ తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	:సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	:పర్తిసాయి
సరిపోదా శనివారం	:షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
నేను కీర్తన	: శ్రీసత్య
11 డిమోంటి కాలని	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 104 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-21 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాటిజివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు. లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 354 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అన్నదాత.. బతుకు వెత

- నీట మునిగిన వరి పొలాలు
- పెట్టుబడి మొత్తం నీటిపాలు
- కన్నీరు పెడుతున్న రైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు
- మండల పరిధిలో 540 ఎకరాలు నీట మునక



మండలంలోని ఊడేరు గ్రామం వద్ద గౌరమ్మ గెడ్డ

అనకాపల్లి : విస్తారంగా కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద నీటి వల్ల డ్రైనేజీలు, పంట కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మేలు జరుగుతుందని రైతులు ఎంతో ఆశగా వరినాట్లు వేశారు. వరి నారుమడులు వేసే సమయంలో రెండు తుపాన్లు రావడంతో వారి ఆశలు అడియాశలు అయ్యాయి. తుపాను ముంచుకొస్తుందని వాతావరణశాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ప్రజా ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలో సుమారు 540 ఎకరాల్లో వరి నారుమడులు నీట మునిగిపోయాయి. పంటలు నీటి ముంపునకు గురై కుళ్లిపోతున్నాయి. నిన్న మొన్నటి వరకు పచ్చగా కళకళలాడిన వరి పొలాలు నేడు కుళ్లి నేలకొరిగి కనిపిస్తున్నాయి. ఆ దృశ్యం చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

> ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలో 540 ఎకరాల వరి పంట నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి నారుమడులు వేసే సమయంలో రెండు సార్లు తుపాన్లు పగ బట్టినట్లు విరుచుకుపడటంతో రైతులు నిస్సహాయులైపోయారు. వారు పెట్టిన పెట్టుబడి నీటి పాలైపోయింది. ఈ ఖరీఫ్‌లో మేలు చేస్తాయనుకున్న వర్షాలు చివరికి తమను నట్టేట ముంచాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లోపించిన చిత్తశుద్ధి..

ఈ ఏడాది మండలంలో నేటి వరకూ 4100 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారు. మరో 1200 ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో తుపాను విరుచుకుపడింది. అనకాపల్లి మండలంలో ఊడేరు చివర చోడవరం మండలం ముద్దుర్తి నుంచి గైరమ్మగెడ్డ పొంగి ఒక్కసారిగా వర్షపు నీరు రావడంతో గట్టు తెగి పొలాల్లోకి నీరు వెల్లువలా వచ్చేసింది. దీంతో అనకాపల్లి మండలంలోని ఊడేరు, దిబ్బపాలెం, తుమ్మపాల, మార్టూరు, బవులవాడ, శంకరం, జాతీయ రహదారి బొజ్జన్న కొండ మీదుగా జీవీఎంసీ విలీన గ్రామమైన ఆవఖండంలోకి వర్షం నీరు చేరి వరి పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. జాతీయ రహదారి సమీపంలో ఆవఖండం భూముల నుంచి మునగపాక పరిధిలో తోటాడ, మునగపాక, మూలపేట నీటిపారుదల శాఖ గేట్లను ఎత్తడంలో అక్కడి అధికారులు సకాలంలో చర్యలు చేపట్టకపోవడంతో రెండు రోజులుగా వర్షం వరి పొలాలకు తీవ్ర నష్టం కలిగించింది.



నీట మునిగిన ఆవఖండం పొలాలు

పంట కాలువల పూడిక తీత ఎప్పుడు?

ఖరీఫ్ సీజన్‌ను పురస్కరించుకుని రైతుల పొలాల్లో నీరు ప్రవహించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు ముందుగా కాలువలను పరిశుభ్రం చేయాలి. అయితే ఈ ఏడాది అధికారులు అటువంటి చర్యలు చేపట్టకపోవడం, తుపాను కారణంగా వరి పొలాలు నీట మునిగాయి. పట్టణ పరిధిలో యల్లయ్యకాలువ, పులికాలువ, నాగులాపల్లి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టలేదు. ఈ పనుల నిమిత్తం జీవీఎంసీ రెండు మాసాల క్రితం రూ.80 లక్షల నిధులు విడుదల చేసినప్పటికీ తూతూ మంత్రంగా పనులు చేపట్టారు.



మునగపాక మండలం తోటాడ రెగ్యులేటరీ గేట్లు

రెండెకరాల పొలం నీట మునిగింది..



తుమ్మపాల గ్రామంలో రెండెకరాల్లో సాగు చేశాను. ఇప్పటికే సుమారు రూ. 50 వేలు ఖర్చు పెట్టాను. అయితే ఈ తుపాను, వర్షాలకు రెండెకరాల పొలం కూడా నీట మునిగిపోయింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు మా పొలం వైపు కన్నెత్తి చూడలేదు. సకాలంలో వర్షం నీరు దిగువకు వదిలితే పొలంలో నీరు నిల్వ ఉండేది కాదు.

– పీలా బంగారయ్య, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి మండలం

వర్షం నీరు దిగువ ప్రాంతాలకు వదులుతున్నాం..



ఊడేరులోని గైరమ్మ గెడ్డ గట్టు కొట్టడంతో పైనుంచి వర్షం నీరు పొలాల్లోకి చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పొలాలు నీట మునిగాయి. జీవీఎంసీ విలీన గ్రామమైన మునగపాక మండలం తోటాడ రెగ్యులేటరీ గేట్లను ఎత్తేయడం వల్ల వర్షం నీరు దిగువ ప్రాంతానికి వెళుతోంది.

– పి.రంగాచారి, మండల వ్యవసాయశాఖ అధికారి, అనకాపల్లి

గణనాథునికీ ఫైన్ వేసిన కూటమి ప్రభుత్వం

అనకాపల్లి : గణనాథునికే అపరాధ రుసుము విధించి కూటమి ప్రభుత్వం బౌరా అనిపించింది. వినాయకుని ఎత్తును బట్టి రూ.350 నుంచి రూ. 700 నగదు మీ సేవలో చెల్లించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. వినాయక మండపాలకే కాకుండా వినాయక విగ్రహాలకు వాటి ఎత్తును బట్టి నగదు కట్టాలనే కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హిందువులను అవమానించడమే అవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై శ్రద్ధ లేదు కానీ, వారి నుంచి నగదు ఎలా వసూలు చేయాలో ఈ ప్రభుత్వానికి బాగా తెలుసన్నారు. గత ప్రభుత్వంలో మండపాలకు మైక్‌సెట్ కోసం అనుమతి తీసుకోవాలంటే దానిని పెద్ద తప్పుగా భావించారని, ఇప్పుడు దేవుళ్ల దగ్గర కూడా నగదు వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం తెచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి : పట్టణంలో ఏఎంసీ కాలనీకి చెందిన 17 సంవత్సరాల విద్యార్థిని అదృశ్యమైనట్లు సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 7వ తేదీన ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో విద్యార్థిని ఇంటి నుంచి బయటికి వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. దీంతో విద్యార్థిని తల్లి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

బెల్లం వర్తకుడు వెంకటరావు మృతి

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో వర్తకుడు కొణతాల వెంకటరావు (64) అనారోగ్యం కారణంగా సోమవారం గవరపాలెంలోని వారి స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతితో మార్కెట్‌కు సెలవు ప్రకటించారు.

నీట మునిగిన పొలాల పరిశీలన



నూతలగుంటపాలెంలో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



శంకరం వద్ద ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎంపీ రమేష్

తుమ్మపాల : భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మండలంలో శంకరం వద్ద బొజ్జన్నకొండ రహదారి నుంచి ముంపునకు గురైన పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. నాలుగు రోజులుగా వరి పంట నీటిలోనే ఉందని, నీరు దిగువకు వెళ్లకపోవడమే కారణమని రైతులు తెలిపారు. జాతీయ రహదారి వద్ద కల్వర్టుల ఎత్తు కారణంగా నీరు దిగువకు ప్రవహించకపోవడంతో ఈ సమస్య వచ్చిందని సీఎం రమేష్ అన్నారు. ఆవఖండం నుంచి తోటాడ రెగ్యులేటర్ గేట్లు తీసివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించేందుకు అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తామన్నారు. ముంపునకు గురై పాడైన పంటలు, నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి సన్యాసినాయుడు, కరణం పవన్, బొండా లక్ష్మీనారాయణ, తోట భూషణరావు, రైతులు కరణం బైరాగి, నాయుడు, కరణం శంకరరావు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు..

కశింకోట : మండలంలో వర్షాల వల్ల నీటి ముంపునకు గురైన వరి పొలాలు, చెరకు తోటలను సోమవారం ఆర్‌ఏఆర్‌ఎస్, కొండెంపూడి కేవీకే నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నీటి ముంపు నుంచి పొలాలను రక్షించుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. వరి పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా తొలగించుకోవాలని, అనంతరం ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల ఎంవోపీ ఎరువులు వేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు ఎస్.రాజకుమార్, ఎస్.సత్తిబాబు, పి.వి. పద్మావతి, ఏవో ఎం.స్వప్న, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేరు కాలువ గట్టుకు ఇసుక బస్తాలతో రక్షణ



ఏలేరు కాలువ గట్టుకు రక్షణగా ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు

తుమ్మపాల : భారీగా కురిసిన వర్షాలకు సబ్బవరం మండలంలోని ఆరిపాక, నారపాడు, నల్లరేగులపాలెంతో పాటు కొండుపాలెం, పాపయ్యపాలెం గ్రామాల కొండవాగుల్లోంచి నీరు దిగువకు చేరింది. దీంతో గెడ్డలు పొంగి ప్రవహించడంతో రైతులు భయాందోళనలు చెందుతున్నారు. మండలంలో పులి కాలువ అనేక గ్రామాల పొలాల మధ్య నుంచి ఆవఖండం వరకు విస్తరించి ఉంది. భారీగా నీరు పారడంతో అనేక చోట్ల గట్లు గండ్లు పడి వరి పొలాలను ముంచెత్తింది. మార్టూరు– రేబాక గ్రామాల పులికాలువ గట్టు తెగిపడటంతో పంట పొలాల్లోకి నీరు చేరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. శంకరం వద్ద ఏలేరు కాలువ ఉధృతి కూడా పెరగడంతో పులికాలువ వద్ద గట్టు మీదుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు సోమవారం ఏలేరు కాలువ గట్టుకు రక్షణగా ఇసుకతో కూడిన సిమెంట్ బస్తాలు వేశారు.

బకాయి జీతాలు చెల్లించాలని నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

తుమ్మపాల : ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్లకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలంటు సీఐటీయూ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తమకు ఆరు నెలలుగా జీతాలు లేవని, అర్ధాకలితో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నెలకు రూ.6 వేల వేతనం అని, అది కూడా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి. వరలక్ష్మి మాట్లాడుతూ స్కూల్ శానిటేషన్ కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని, ప్రస్తుతం పని చేస్తున్న వర్కర్లను తొలగించకుండా ప్రతినెల ఐదో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి, పని గంటలు, ఇతర పనులు తగ్గించాలన్నారు. డీఆర్వో బి.దయానిధి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. శంకరరావు, జి.కోటేశ్వరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, యూనియన్ గౌరవ అధ్యక్షులు శ్రీదేవి, జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి, కార్యదర్శి జానకి తదితరులు పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న నదులు



ఏనుగుతునిలో వర్షాలకు నిండా మునిగిన వరి పొలాలు



కశింకోట వద్ద పొంగి ప్రవహిస్తున్న శారదా నది

కశింకోట : కశింకోట వద్ద శారదానది సోమవారం పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతంలోని రైవాడ నుంచి నీరు విడుదల చేయడం, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో నీటి మట్టం మరింతగా పెరిగింది. నదిపై వరుసగా నాలుగో రోజు కూడా దోనె ప్రయాణాలు నిలిచిపోవడంతో రైతులు తమ పొలాలకు రాకపోకలు సాగించడానికి అవకాశం లేక తీవ్ర ఇబ్బంది చెందారు. ఉదయం 8.30 గంటల వరకు 65.8 మిల్లీమీటర్లు, అప్పటి నుంచి మధ్యాహ్నం వరకు 2.6 మిల్లీమీటర్ల వంతున స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వర్షపాతం నమోదు అయింది. ఇప్పుడు వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నీట మునిగిన వరి నాట్లు..

వర్షాలకు పలుచోట్ల సుమారు 250 ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండ గెడ్డలు, శారదా నది పొంగి నీరు ముంచెత్తడంతో నూతలగుంటపాలెం, ఏనుగుతుని, నరసింగబిల్లి, కశింకోట, వెదురుపర్తి, తాళ్లపాలెం తదితర ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. నూతలగుంటపాలెం, ఏనుగుతునిలో సుమారు 150 ఎకరాల్లో పొలాలు నీట మునిగిపోయాయి. మిగిలిన గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో పొలాలు ముంపునకు గురయ్యాయి. గత ఏడాది కూడా ఇలాగే వరి పొలాలు మునిగి నష్టపోతే పరిహారం మంజూరు అయినా అందజేయలేదని, ఇప్పుడు మళ్లీ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.



నూతలగుంటపాలెంలో చెరువును తలపిస్తున్న పంట భూములు

సరికొత్త చేతక్ షోరూం ప్రారంభం

అనకాపల్లి : బజాజ్ ఆటో సంస్థ సరికొత్త చేతక్ షోరూం ప్రారంభమైంది. అనకాపల్లి టౌన్ శారదా కాలనీలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేతక్ డివిజన్ ఏరియా సేల్స్ మేనేజర్ వి.రవితేజ, ఏరియా సర్వీస్ మేనేజర్ అరుణ్‌కుమార్ వెంకటేశన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ మాట్లాడుతూ బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్లకు కస్టమర్ల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, వారికి మరింత చేరువ కావటానికి అన్ని సౌకర్యాలతో కూడిన షోరూంను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వరణ్ బజాజ్ సీఈవో శ్రీనివాస్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



చేతక్ షోరూంను ప్రారంభిస్తోన్న డివిజన్ ఏరియా సేల్స్ మేనేజర్ రవితేజ

అక్కినేని శతజయంతి వేడుకల్లో కోట్నికి సత్కారం



విశాఖలో కోట్ని సన్యాసినాయుడుని సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : అక్కినేని శత జయంతి వేడుకల్లో భాగంగా అక్కినేని నాగేశ్వరావు అభిమాని అయిన సన్యాసినాయుడుని ఆదివారం రాత్రి విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. విశాఖ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అక్కినేని సీనియర్ అభిమాని అయిన సన్యాసినాయుడుని శ్రీ సీతారామయ్య స్మారక సమాజం నిర్వాహకులు కోనాడ వెంకట్రావు ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమానికి విశాఖ, అనకాపల్లి, జిల్లాల నుంచి అక్కినేని అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి వితరణ

బుచ్చెయ్యపేట : సీతయ్యపేట గ్రామానికి చెందిన కిడ్నీ బాధితురాలికి స్థానిక యువకులు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన నానిపల్లి దుర్గమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మందులు కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. దీంతో సీతయ్యపేట యూత్ యువకులు కలిసి రూ, 49,100 నగదును దుర్గమ్మ కుమారుడు నానికి సోమవారం అందించారు.



బాధితురాలి కుమారుడికి నగదు అందిస్తున్న సీతయ్యపేట యువకులు

తెగుళ్ల బారిన పంటలు



మాడుగుల : పంట చేలకు పురుగు మందు పిచికారీ



కొమరవోలులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వరహాలు, ఏవో విజయలక్ష్మి



మాడుగులలో నీటి ముంపునకు గురైన వరి చేలు

మాడుగుల : ఈ ఏడాది వరి నాట్ల సమయంలో వర్షాలు అనుకూలించకపోవడంతో వ్యవసాయ మోటార్లతో పాటు పంట చెరువులు, జలాశయం ఆయకట్టు ప్రాంతాల్లో అతి కష్టం మీద వరి నాట్లు వేసుకున్నారు. నాట్లు వేసిన 20 రోజులకే వర్షాలు అధికమవ్వడంతో కలుపు పెరిగిపోయింది. పాము పొడ తెగుళ్లు ఆశిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తుపాను కారణంగా నియోజకవర్గంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి నీట మునిగింది. పల్లపు ప్రాంతాల్లో పంట నీట మునగగా, మెట్ట ప్రాంతాల్లో వరి చేలకు పాచి తెగుళ్లు ఆశించాయని రైతులు చెబుతున్నారు. కాగా తగిన రక్షణ చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. వరి నాట్లు వేసిన 30 రోజుల తర్వాత చేలుకు పాము పొడ తెగులు(పాచితెగుళు) ఆశించే అవకాశాలున్నాయని, దీని నివారణకు ముందస్తుగా సూడోమోనాస్ లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఆకులపై మచ్చలు వస్తే అగ్గి తెగులు ఆశించే అవకాశాలున్నాయని, ముందుగా కలుపు లేకుండా చూసుకుని కార్బన్డిజమ్ 1 లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలాల్లోని నీటిని బయటకు పంపించి 20 కిలోలు, యూరియా, 20 కిలోల పొటాస్ వేస్తే సరిపోతుందని తెలిపారు.

పంటనష్టం అంచనాల్లో అధికారులు

రోలుగుంట : భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, గృహాలను అధికారులు సోమవారం పరిశీలించారు. తహసీల్దార్ కె.వరహాలు, మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పడాలపాలెం రెవెన్యూలో గల దెబ్బతిన్న రైతుల వరిపొలాలను పరిశీలించారు. వరిపొలంలో కుళ్లిన కాండం భాగాన్ని గుర్తించారు. కోమరవోలు ,అడ్డసరం రెవెన్యూలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, వీఆర్వో శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు జానకీరాంపురం, కుసుర్లపూడిలో వరి పొలాలను పరిశీలించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



గవర్ల అనకాపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విమలగిరి

మునగపాక: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి సూచించారు. మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో డెంగ్యూతో విద్యార్థిని మృతి చెందడంతో ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు రోగాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అనారోగ్యంగా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.